ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో అధికార పార్టీ ఆరుచోట్ల ఇంఛార్జులను మార్చింది. వైసీపీ గురువారం రాత్రి విడుదల చేసిన మూడో జాబితా మేరకు ఆరుగురు సిట్టింగులకు టికెట్లు గల్లంతైనా అందులో ముగ్గురికి పార్టీ అధిష్ఠానం ప్రత్యామ్నాయం చూపింది. తిరుపతి ఎంపీ గురుమూర్తి సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గానికి బదిలీ కాగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తిరుపతి పార్లమెంటుకు బదిలీ అయ్యారు. చిత్తూరు సిట్టింగు ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు రాజ్యసభ స్థానానికి బదిలీ అయ్యారు. ఈ ముగ్గురినీ మినహాయిస్తే గూడూరులో వరప్రసాదరావు, పూతలపట్టులో ఎంఎస్ బాబు, మదనపల్లెలో నవాజ్ బాషాలకు టికెట్లు గల్లంతయ్యాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఆరుచోట్ల వైసీపీకి కొత్త ఇన్‌ఛార్జులొచ్చారు!

ఐదు స్థానాల్లో తప్పని అంతర్గత సంక్షోభం

తిరుపతి ఎంపీ, సత్యవేడు ఎమ్మెల్యే పరస్పర బదిలీ

తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి సత్యవేడు ఇంచార్జిగా బదిలీ అయ్యారు. రానున్న ఎన్నికల్లో తిరుపతి నుంచీ మళ్ళీ ఎంపీగా పోటీ చేయడానికే ఆయన మొగ్గు చూపుతున్నారు. పెద్దగా శ్రమ, ఖర్చు లేకుండా ఎంపీగా గెలిచే అవకాశముంటుందని ఆయన భావిస్తున్నట్టు సమాచారం. దానికి తోడు సత్యవేడు టీడీపీకి కంచుకోట కావడం, అక్కడి నుంచీ గెలుపు కష్టసాధ్యమని గ్రహించడంతో ఎంపీ పదవి వైపే ఆయన మనసు లాగుతోందని సమాచారం. అయితే అధిష్ఠానం ఆదేశంతో అయిష్టంగానే సత్యవేడుకు వెళ్ళేందుకు అంగీకరించినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. అదే సమయంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సైతం అక్కడే మళ్ళీ పోటీ చేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. కానీ నియోజవకర్గంలో వ్యతిరేకవర్గం బలంగా వుండి టికెట్‌కు అడ్డుపడడంతో బదిలీ తప్పలేదు. ఆయన కూడా అయిష్టంగా, అసంతృప్తిగా తిరుపతి పార్లమెంటు అభ్యర్థిత్వానికి ఒప్పుకున్నట్టు ఎమ్మెల్యే సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఇష్టం లేని చోట్ల పోటీ ఈ ఇద్దరికీ చేదు అనుభవాన్నే మిగుల్చుతాయేమోనన్న భయాందోళన వారి సన్నిహిత వర్గాల్లో వ్యక్తమవుతుండడం గమనార్హం.




గురుమూర్తి - ఆదిమూలం

ముగ్గురు ఎమ్మెల్యేలకు టికెట్ల గల్లంతు

గూడూరులో సిట్టింగ్ ఎమ్మెల్యే వరప్రసాదరావుకు టికెట్ గల్లంతైంది. ఆయన రిటైర్డు ఐఏఎస్ అధికారి కావడంతో రాజకీయాల్లో ప్రజలకు, కార్యకర్తలకు చేరువ కాకుండా ఓ గిరి గీసుకుని అందులోనే వుండిపోయారు. దీంతో సొంత వర్గమంటూ లేకుండా పోయింది. ఎమ్మెల్సీ మేరిగ మురళీధరరావు సీఎం జగన్‌కు సన్నిహితుడైన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మద్దతుతో ఇంఛార్జిగా నియమితులైనట్టు సమాచారం. నేదురుమల్లి, నల్లపురెడ్డి వర్గాలు ఇప్పటికీ గూడూరులో ఎంతోకొంతమేర ప్రభావం చూపుతున్నాయి. ఈ రెండు వర్గాల మద్దతు మురళీధరరావుకు లభించనుంది. కాకపోతే ఈ రెండు వర్గాల కంటే కూడా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి వర్గం ఇక్కడ బలంగావుంది. ఆ వర్గం మురళీని వ్యతిరేకిస్తోంది. అధిష్ఠానం అతడికే ప్రాధాన్యత ఇవ్వడంతో పేర్నాటి వర్గం మిన్నకుండిపోయింది.ఎన్నికల్లో మురళీ విజయానికి ఈవర్గం పని చేసే పరిస్థితి కనిపించడం లేదు. ఆ రకంగా చూస్తే వరప్రసాదరావును మార్చడం వల్ల వైసీపీకి ఇక్కడ నష్టమే తప్ప లబ్ధి కలిగే పరిస్థితి లేదనే చెప్పాలి. పూతలపట్టు విషయానికొస్తే సిట్టింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు అధిష్ఠానం మొండిచేయి చూపింది. గత ఎన్నికల్లో వద్దనుకున్న డాక్టర్ ముత్తిరేవుల సునీల్‌కుమార్ ఇపుడు ముద్దయ్యారు. ఎంఎస్ బాబుకు నియోజకవర్గంలోని ప్రతి దళితవాడలోనూ సొంత వర్గం ఏర్పడింది. ఇపుడా వర్గం సునీల్‌కుమార్ గెలుపుకోసం పనిచేసే అవకాశాల్లేవు. దానికి తోడు ఎంఎస్ బాబు కోసం గట్టిగా పోరాడిన నలుగురైదుగురు రెడ్డి సామాజికవర్గానికి చెందిన నాయకులు అధిష్ఠానం తీరుతో అసంతృప్తితో అలిగి దూరంగా వున్నట్టు సమాచారం. వీరు చేతులెత్తేస్తే పార్టీ మునిగిపోయినట్టేనన్న ప్రచారం జరుగుతోంది. అలాగే మదనపల్లెలోనూ సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్ బాషాకు అధిష్ఠానం రిక్త హస్తం చూపింది. ఆయన్ను కాదని అసలు రాజకీయాలతో సంబంధమే లేని నిషార్ అహ్మద్‌కు అవకాశమిచ్చింది. దీంతో నవాజ్ బాషా వర్గం ఎన్నికల్లో పనిచేసే వాతావరణం కనిపించడం లేదు. ఇదివరకూ ఇక్కడ మైనారిటీ ఓటర్లు మూకుమ్మడిగా వైసీపీకి మద్దతిచ్చారు. దానికి తోడు మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా టీడీపీలో చేరడంతో మైనారిటీ ఓటర్లలో గణనీయమైన చీలిక ఏర్పడే అవకాశాలేర్పడ్డాయి.




వరప్రసాదరావు - మేరిగ మురళీధర్




ఎంఎస్ బాబు - సునీల్‌కుమార్




నవాజ్‌బాషా - నిస్సార్ అహ్మద్

ఆరణికి రాజ్యసభ ఖరారైనా....

చిత్తూరు సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు కూడా టికెట్ గల్లంతైంది. అయితే ఆయనకు రానున్న రాజ్యసభ ఎన్నికల్లో అవకాశం కల్పించేందుకు అధిష్ఠానం నిర్ణయించిందని, ఇక ప్రకటించడమే మిగిలిందన్న ప్రచారం నడుస్తోంది. నిజానికి రాజ్యసభ అవకాశం కల్పించడం శ్రీనివాసులుకు పదోన్నతి కల్పించినట్టే. చిత్తూరులో పోటీ చేసినా గెలుస్తామో లేదో తెలియని స్థితిలో రాజ్యసభ సభ్యత్వం దక్కే అవకాశాలేర్పడడం ఆయనకు అదృష్టమనే చెప్పాలి. కాకపోతే ఎంపీగా ఎన్నికైనా కూడా చిత్తూరు సెగ్మెంట్‌లో పార్టీ అభ్యర్థి గెలుపుకోసం సహకరిస్తారా అన్నది అనుమానంగానే వుంది. దానికి తోడు శ్రీనివాసులును అసెంబ్లీ బరి నుంచీ తప్పించడం పట్ల చిత్తూరు నియోజకవర్గంలో గణనీయంగా వున్న బలిజ సామాజికవర్గం తీవ్ర అసంతృప్తితో వుంది. దాదాపుగా ఆ సామాజికవర్గమంతా వైసీపీకి మద్దతివ్వరాదని అంతర్గతంగా సమావేశాలు పెట్టుకుని మరీ తీర్మానాలు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఇక వైసీపీ ఇంచార్జి విషయానికొస్తే ఎర్రచందనం అక్రమ రవాణా నేపథ్యం ఆయన గెలుపుకు అవరోధం కానుంది. పీడీ యాక్టు కింద అరెస్టయి జైలులో గడిపి వచ్చిన నేపథ్యం విద్యావంతులపై ప్రభావం చూపే అవకాశముంది. అంతే కాకుండా వెన్నంటి వుండే అనుచరవర్గం పట్ల నియోజకవర్గ ప్రజల్లో దౌర్జన్యకర శక్తులనే ముద్ర పడింది. ఇవన్నీ పార్టీ విజయానికి ప్రతిబంధకం కానున్నాయనే ప్రచారం జరుగుతోంది.




ఆరణి శ్రీనివాసులు - విజయానందరెడ్డి

పెరగనున్న అంతర్గత విభేదాలు

మొత్తం మీద అధికార పార్టీ గురువారం విడుదల చేసిన మూడవ జాబితాతో అంతర్గత సంక్షోభం నెలకొంది. సత్యవేడు, గూడూరు, చిత్తూరు, పూతలపట్టు, మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సిట్టింగులను పక్కనపెట్టి కొత్తవారిని ఇంఛార్జులుగా నియమించడం వల్ల పార్టీలో అంతర్గత విభేదాలు, కుమ్ములాటలు మరింతగా పెరగనున్నాయి. సిట్టింగు ఎమ్మెల్యేలు, వారి వర్గాలు కొత్త వారి గెలుపుకోసం సహకరించే అవకాశాలు దాదాపుగా లేవనే చెప్పాలి. ఎన్నికలు సమీపించేకొద్దీ ఈ వర్గాల నడుమ అగాధం మరింతగా పెరిగి మరింత సంక్షోభానికి దారి తీసే ప్రమాదమూ లేకపోలేదు.

సచివాలయంలో 'ఆడుదాం క్రికెట్'

- టీడీపీ సానుభూతిపరులని ఆపేశారంటూ బొమ్మయ్యపల్లెలో ఆటగాళ్ల నిరసన



సచివాలయంలో క్రికెట్ ఆడుతూ నిరసన తెలుపుతున్న ఆటగాళ్లు

వెదురుకుప్పం, జనవరి 11: మైదానంలో ఆడాల్సిన క్రికెట్‌లో వివక్ష చూపుతారా? టీడీపీ సానుభూతిపరులమని 'ఆడుదాం ఆంధ్ర' మమ్మల్ని నిలిపేస్తారా.. అంటూ ఆటగాళ్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె సచివాలయంలో క్రికెట్ ఆడి తమ నిరసన తెలిపారు. వీరు తెలిపిన ప్రకారం.. బొమ్మయ్యపల్లె గ్రామ సచివాలయంలోని తిప్పినాయుడుపల్లెకు చెందిన జట్టు ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో సచివాలయ పరిధిలో గెలిచింది. వీరిని బుధవారం మండలస్థాయి క్రికెట్ పోటీలకు వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఆడటానికి పిలిపించారు. ఆ తర్వాత వీరిని ఆపేశారు. తాము లేకుండానే గురువారం ఏకపక్షంగా తమ ప్రత్యర్థి జట్టు అయిన మారేపల్లె వారిని విజేతలు ప్రకటించారంటూ వీరు ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము టీడీపీ సానుభూతిపరులు కావడంతోనే ఏకపక్ష ధోరణితో నిలిపివేశారని ఆరోపించారు. దీంతో గురువారం బొమ్మయ్యపల్లె గ్రామ సచివాలయంలో క్రికెట్ ఆడి నిరసన వ్యక్తం చేశారు. సచివాలయం సిబ్బందికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో సచివాలయంలో గోలగోలగా కనిపించింది. ఈ ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు.

వాళ్లు పోటీలకు రానందునే..

బుధవారం సాయంత్రం జరగాల్సిన ఈ క్రీడలు వాయిదా పడి గురువారం నిర్వహించాం. గురువారం నాటి పోటీలకు తిప్పినాయుడుపల్లె జట్టు రాలేదు. వాళ్ల వేరే చోట ఎక్కడో ఆట ఆడటానికి వెళ్లినట్లు సమాచారం. వెదురుకుప్పంలో జరిగిన పోటీలకు వాళ్ల రాకపోవడంతో మండల అధికారుల నిర్ణయంతో మారేపల్లి టీంకు బై చేశారు. ఇందులో మా తప్పిదం లేదు.

- మహేశ్, తిప్పినాయుడుపల్లె గ్రామ కార్యదర్శి

పసుపు టీషర్టుతో ఆట

'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో పసుపు టీ షర్టుతో క్రికెట్ ఆడారాయన. జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను సీఎం అయ్యాక నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. దీనికి నిరసనగా పసుపు టీ షర్టుతో క్రికెట్ ఆడినట్లు వెదురుకుప్పం గ్రామ కమిటీ అధ్యక్షుడు అనిల్ గురువారం తెలిపారు. సీఆర్‌కండ్రిగ జట్టు తరపున తాను క్రికెట్ ఆడినట్లు చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన టీ షర్ట్ వేసుకోకుండా పసుపు షర్ట్ వేసుకుని క్రికెట్ ఆడినట్లు తెలిపారు.

- వెదురుకుప్పం

పసుపు టీషర్టు ధరించి క్రీడల్లో పాల్గొన్న అనిల్



ప్రారంభించి బీగాలు వేసేశారు

- ఫార్సుగా మారిన సామాజిక సమతా సంకల్పం ఫొటో ప్రదర్శన




పీసీఆర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఫొటో గ్యాలరీని పరిశీలిస్తున్న ఎంపీ, జేసీ తదితరులు - అధికారులు వెళ్లిపోయిన వెంటనే ఫొటోగ్యాలరీని మూసేసిన అధికారులు


చిత్తూరు, జనవరి 11: పీసీఆర్ జూనియర్ కళాశాలలో సామాజిక సమతా సంకల్పంలో భాగంగా చిత్తూరులో ప్రారంభించిన అంబేడ్కర్ జీవితచరిత్ర ఫొటో ప్రదర్శన ఒక ఫార్సుగా మారింది. గురువారం పీసీఆర్ జూనియర్ కళాశాలలో ఫొటో గ్యాలరీని నగర మేయర్ అముద, జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్‌లతో కలిసి ఎంపీ రెడ్డెప్ప ప్రారంభించారు. అనంతరం పీసీఆర్ జూనియర్ కళాశాలలో నాడు-నేడులో భాగంగా రూ.78 లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్వో ప్లాంట్, నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించారు. ఫొటో ప్రదర్శనను కళాశాలల, పాఠశాలల విద్యార్థుల సందర్శనార్థం ఈనెల 19వ తేదీవరకు ఏర్పాటు చేశామని అధికారులు చెప్పినా, నాయకులు ప్రారంభించి వెళ్లిపోయిన వెంటనే ఆ గదికి బీగాలు వేసుకుని వెళ్లిపోయారు. దీంతో ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు వచ్చిన విద్యార్థులు వెనుదిరిగివెళ్లారు. కాగా, అంతకు ముందు దర్గా సర్కిల్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అక్కడినుంచి పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డీడీ రాజ్యలక్ష్మి, జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, కమిషనర్ అరుణ పాల్గొన్నారు.

వీఆర్‌ఏలూ సమ్మె బాటే..!

- 20వతేదిలోగా సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయం

చిత్తూరు రూరల్, జనవరి 11: ఇప్పటికే అంగన్వాడీలు, సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. 108, 104 ఉద్యోగులూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే 20వ తేది తర్వాత సమ్మెలోకి వెళ్తామని స్పష్టంచేశారు. తాజాగా.. వీఆర్వోఏలూ సమ్మె నిర్ణయం తీసుకున్నారు. వీరూ 20వ తేదీనే డెడ్‌లైన్‌గా పెట్టారు. అప్పటిలోగా తమ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె బాట పడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు చిత్తూరులోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం వీఆర్‌ఏ సంఘ ముఖ్యనేతలతో రాష్ట్ర నాయకుడు అంజి సమావేశం నిర్వహించారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. రూ.26 వేల కనీస వేతనం అమలు, టీఏ. డీఏల పెంపు, అటెండర్ ప్రమోషన్లలో 70శాతం పర్సంటేజ్ పెంచాలని డిమాండు చేశారు. అనంతరం డీఆర్వో రాజశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకుడు చైతన్య, వీఆర్ఏలు పాల్గొన్నారు. ఇలా ఆయా శాఖల ఉద్యోగులు సమ్మెవైపు అడుగులు వేస్తుండటం గమనార్హం.

అంగన్వాడీల నిరసన హోరు



కార్వేటినగరంలో ఆందోళన

చిత్తూరు, జనవరి 11: తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె గురువారానికి 31వ రోజుకు చేరింది. జిల్లాలో సీడీపీవో, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలను చేపట్టారు. చిత్తూరు కలెక్టరేట్ వద్ద దీక్షను కొనసాగించారు. పలమనేరులో అంగన్వాడీ వర్కర్లు సీడీపీవో కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శిబిరం వద్ద కూర్చుని నిరసన తెలిపారు. కార్వేటినగరంలోనూ అంగన్వాడీలు నిరసన కొనసాగించారు. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తీర్చే వరకు సమ్మెను విరమించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రాష్ట్రస్థాయిలో చిత్తూరుకు 9వ ర్యాంకు

చిత్తూరు, జనవరి 11: స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో చిత్తూరు నగరపాలక సంస్థకు జాతీయస్థాయిలో 143వ ర్యాంకు లభించింది. 1-10 లక్షల జనాభా కేటగిరీలో జాతీయస్థాయిలో 446 నగరాలతో పోటీపడి ఈ ర్యాంకు సాధించినట్లు కమిషనరు అరుణ గురువారం తెలిపారు. గతేడాది ఈ ర్యాంకు 153 ఉండిందన్నారు. ఈ సారి పది ర్యాంకులు మెరుగైనట్లు వివరించారు. రాష్ట్రస్థాయిలో 31 నగరాలతో పోటీపడుతూ 9వ స్థానంలో నిలిచిందన్నారు. 'పారిశుధ్యం, చెత్త సేకరణ, డంపింగ్ యార్డు నిర్వహణ, ఓడీఎఫ్ ప్లస్, సిటిజన్ ఫీడ్‌బ్యాక్ కేటగిరీల్లో గత ఏడాది కంటే మెరుగైన మార్కులు సాధించింది. 2022లో 3433.86 మార్కులు సాధించగా, 2023లో 5174.45 మార్కులు సాధించింది' అని వివరించారు. సహకరించిన నగరప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

33మంది 'ఎండీయూ' ఆపరేటర్లకు జీతాలు కట్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 11: ఇంటింటికీ నిత్యావసర వస్తువులు అందించాల్సిన ఎండీయూ వాహన ఆపరేటర్లు విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించారన్న ఆరోపణపై 33మందికి జీతాలు నిలుపుదల చేస్తూ జిల్లా పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లావ్యాప్తంగా 5.41లక్షల రేషన్‌కార్డుదారులకు చిత్తూరు డివిజన్‌లో 167 మంది, పలమనేరు డివిజన్‌లో 169 మంది ఎండీయూ వాహన ఆపరేటర్లు ప్రతినెలా 1-17 తేదీల మధ్య నిత్యావసర వస్తువులు అందజేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.18వేలను, సహాయకులకు రూ.3వేలను జీతంగా ప్రభుత్వం చెల్లిస్తోంది. కాగా, డిసెంబరులో కార్డుదారులకు నిత్యావసర వస్తువులు సక్రమంగా అందించని కారణంగా 33మంది జీతాలను ఈనెల ప్రారంభంలో నిలిపివేస్తూ డీఎస్వో కార్యాలయం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు



హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు



విజేతలు వీరే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

ట్రాక్టర్‌ను ఢీకొన్న ట్రాన్స్‌పోర్టు లారీ

వృద్ధుడి మృతి, డ్రైవర్‌కి తీవ్రగాయాలు

బంగారుపాళ్యం, జనవరి 11: ట్రాక్టర్‌ని ఓ ట్రాన్స్‌పోర్టు లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందగా, డ్రైవర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మహాసముద్రానికి చెందిన చిన్నయ్య, కరిపిరెడ్డిపల్లెకు చెందిన రామయ్య (65)లు ట్రాక్టర్‌లో కేజీసత్రానికి బయల్దేరారు. బుధవారం అర్ధరాత్రి చెన్నై- బెంగళూరు జాతీయ రహదారిలోని సంక్రాంతిపల్లె సమీపంలో ఉన్న కిరిపిరెడ్డిపల్లె వద్దకొచ్చేసరికి చిత్తూరు నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న వీఆర్ఎల్ ట్రాన్స్‌పోర్టుకు చెందిన లారీ వెనుకవైపు నుంచి ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ చిన్నయ్య, రామయ్య తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రామయ్య చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం అయ్యాక బంధువులకు అప్పగించి, ఏఎస్ఐ మల్లప్ప కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్నతోడు కింద రూ.15.96 కోట్ల లబ్ధి



లబ్ధిదారులకు చెక్ అందిస్తున్న ఎంపీ, కలెక్టర్ తదితరులు

చిత్తూరు, జనవరి 11: చిరువ్యాపారులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు కార్యక్రమాన్ని అమలు చేసిందని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప అన్నారు. గురువారం తాడేపల్లి నుంచి సీఎం జగన్ వర్చువల్ విధానంలో 8వ విడత జగనన్న తోడు పథకాన్ని ప్రారంభించగా, స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ షన్మోహన్, జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, ఇతర జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 15,085 మందికి రూ.15.96కోట్లు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. అర్బన్ పరిధిలో 4,447 మందికి రూ.4.60 కోట్లు, గ్రామీణ ప్రాంతంలోని 10,738 మందికి రూ.11.36 కోట్లు వారి ఖాతాల్లో జమ అవుతుందన్నారు. జడ్పీ మహిళాస్థాయీ చైర్‌పర్సన్ భారతి, డీఆర్డీఏ పీడీ తులసి, జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, జిల్లా యువజన సంక్షేమ అధికారి ప్రదీప్ కుమార్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

'వైసీపీది అప్రజాస్వామిక పాలన'

చిత్తూరు సిటీ, జనవరి 11: వైసీపీది అప్రజ్వామిక పాలన అని ఎన్ఆర్ఐ యష్ విమర్శించారు. చిత్తూరులోని తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు కాజూరు రాజేష్ నివాసంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ నిత్య అబద్ధాలు, మోసాలతోనే పాలన సాగిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తూ, ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం జగన్ తప్పులను ఎత్తి చూపినందుకు తనను అక్రమంగా అరెస్టు చేశారన్నారు.



సీఆర్ రాజన్‌కు సన్మానం

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, తిరుచానూరు మాజీ సర్పంచ్ సీఆర్ రాజన్ జన్మదినం సందర్భంగా గురువారం ఆయన్ను గజమాలతో సత్కరిస్తున్న కిషోర్‌రెడ్డి, హరిరామ్‌రెడ్డి, సాయి రాయల్, తిరుచానూరు టీడీపీ నేతలు

19న చంద్రబాబు సభ కోసం స్థలాల పరిశీలన



రామానాయుడుపల్లె వద్ద స్థలాన్ని పరిశీలించిన టీడీపీ నేతలు

గంగాధరనెల్లూరు, జనవరి 11: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబునాయుడు ఈనెల 19న రా.. కదలిరా బహిరంగ సభ నిర్వహించనున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ భీమనేని చిట్టిబాబునాయుడు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, యాదవసాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్‌లతోపాటు పలువురు నాయకులు గురువారం స్థల పరిశీలన చేశారు. గంగాధర నెల్లూరు మండలంలోని రామానాయుడుపల్లె, నెల్లేపల్లె గ్రామాల వద్ద, అదేవిధంగా శ్రీరంగరాజపురం మండలంలోని క్షీరసముద్రం వద్ద చిత్తూరు - పుత్తూరు ప్రధానరోడ్డుకు పక్కన ప్రైవేటు భూముల్లో బహిరంగ సభ, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ ఏర్పాటు కోసం స్థలాలను పరిశీలించారు. ఈ వివరాలను జిల్లా, రాష్ట్ర టీడీపీ నేతల దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు గుండయ్య, నెల్లేపల్లె మాజీ సర్పంచ్ పుష్పరాజ్, మండల ప్రధానకార్యదర్శి జ్యోతిరెడ్డి, నేతలు రాజశేఖర్ నాయుడు, మునిరాజులయాదవ్, దేవరాజులు నాయుడు, సిద్ధయ్యశెట్టి, విజయకుమార్‌రెడ్డి, దేవరాజులు, వెంకటేష్‌యాదవ్, చిదంబరం, దాము, బుజ్జిబాబు, చిన్ని పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయానికి రూ.11.11 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న దాత

ఐరాల (కాణిపాకం), జనవరి 11: ప్రముఖ పుణ్యక్షేత్రమై కాణిపాకంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి రూ.5,00,000, గో సంరక్షణ ట్రస్టుకు 5,11,111, ఆలయంలో నిర్వహించే ఉదయాస్తమయ సేవకు రూ.1,00,000 హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన మురళీకృష్ణ విరాళమిచ్చారు. ఈ మొత్తానికి చెందిన చెక్‌ను అధికారులకు అందించారు. దాతకు ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'రా... కదలిరా' సభను విజయవంతం చేయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 11: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఈనెల 19న టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించే 'రా... కదలిరా' సభను చేయాలని ఆ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ.. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో తీసుకెళ్లేందుకు, రాష్ట్ర అభివృద్ధికి టీడీపీ అధికారంలోకి రావాలన్న అవసరాన్ని తెలియజేయడమే ఈ సభ ఉద్దేశమన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర కుమార్, అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, జిల్లా తెలుగుమహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ, నేతలు శశికర్ బాబు, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరు నుంచి వెంటాడి..!

● కందూరు వద్ద పట్టుబడిన 'ఎర్ర' కారు

సోమల, జనవరి 11: ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న కారును పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది వెంటాడారు. సోమల మండలం కందూరు వద్ద పట్టుకున్నారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లె ప్రాంతం నుంచి చెన్నైకి ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారంతో అటవీశాఖ అధికారులు నిఘా వేశారు. గురువారం ఉదయం 5 గంటలకు పీలేరు పొంతల చెరువు క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓ కారు ఆగకుండా వేగంగా వెళ్లిపోయింది. అటవీశాఖ అధికారులు ఆ కారును వెంబడించడంతో రేగళ్ల మీదుగా సోమల వైపు మళ్లింది. అయినా అధికారులు వెంటాడడంతో కందూరు వద్ద దుండగలు కారును వదలి పారిపోయారు. కారును, రూ.8 లక్షల విలువ చేసే ఐదు ఎర్రచందన దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

పాలవ్యాన్ ఢీకొని ఇద్దరి దుర్మరణం

● మరొకరికి తీవ్రగాయాలు



మృతిచెందిన నారాయణప్ప, రాజేష్ - తీవ్రంగా గాయపడిన లోకనాథ ఆచారి

గంగవరం, జనవరి 11: గంగవరం మండలం మారెడుపల్లె సమీపంలోని పలమనేరు- దండపల్లె రహదారిలో గురువారం ద్విచక్రవాహనాన్ని పాలవ్యాన్ ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన ప్రకారం.. పలమనేరు పట్టణానికి చెందిన నారాయణప్ప, రాజేష్, లోకనాథ ఆచారి వెల్డింగ్ పనులు చేసుకొంటూ జీవనం సాగించేవారు. దండపల్లె సమీపంలో ఓ ఇంటికి గేటు అమర్చడం కోసం ఈ ముగ్గురూ ద్విచక్రవాహనంలో గురువారం బయలుదేరారు. దండపల్లె రోడ్డులో వెళ్తుండగా, ఎదురుగా అతివేగంగా వస్తున్న పాలవ్యాన్ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో నారాయణప్ప(54) అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన మిగిలిన ఇద్దరిని స్థానికులు ఆటోలో పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజేష్(44) మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన లోకనాథ ఆచారిని చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు : డీఎంహెచ్‌వో

చిత్తూరు రూరల్, జనవరి 11: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో తాత్కాలిక ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, ఎంపీహెచ్‌ఏ సర్వీసుల క్రమబద్ధీకరణకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి తెలిపారు. కొంత మంది దళారులు తాము పర్మినెంట్ చేయిస్తామని డబ్బులు అడిగితే ఇచ్చి మోసపోవద్దన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

అభివృద్ధిని గాలికొదిలేసిన వైసీపీ : అమర్


మాట్లాడుతున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి

గంగవరం, జనవరి 11: వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి విమర్శించారు. గురువారం మండలంలోని చౌడి రెడ్డిపల్లె, జీడి మాకులపల్లె, కురప్పల్లె, బత్తనపల్లె, లక్ష్మీపురం, కొంగోళ్లపల్లె, మారేడుపల్లె, నల్లగుట్లపల్లె గ్రామాల్లో ఇంటింటికీ తెలుగుదేశం, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమరనాథరెడ్డి మాట్లాడుతూ టీడీపీ హయాంలో వేసిన రోడ్లు, ఎల్ఈడీ లైట్లు మాత్రమే దర్శనమిస్తున్నా యన్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా రూ.139 కోట్లు నిధులతో నియోజకవర్గంలో రోడ్లు వేయించానన్నారు. కొన్నిరోడ్లకు నిధులు ఉన్నా ఈ ప్రభుత్వం వేయలేదన్నారు. అక్రమ కేసులతో అరాచకాలకు పాల్పడుతున్న ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్ప డానికి టీడీపీ, జనసేన కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, గౌడ్, ప్రతాప్‌రెడ్డి, గిరిధర్‌గోపాల్, యుగంధర్‌నాయుడు, నరసింహారెడ్డి, శివయ్య, శంకర్‌రెడ్డి, సురేంద్రబాబు, కృష్ణప్ప, శ్రీనివాసులు, బాలచంద్రారెడ్డి, మురళి, హరికృష్ణ పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే జైలుకే

పలమనేరు, జనవరి11 : బాలలను పనిలో పెట్టుకుంటే జైలు శిక్ష తప్పదని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవ అధికార సంస్థ చైర్మెన్ పి. శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా పట్టణంలో న్యాయవాదులు, లేబర్‌ఆఫీసర్ మధుబాబు విస్తృత ప్రచారం చేశారు. పట్టణంలోని పలు దుకాణ, హోటల్ యజమానులను కలిసి బాలకార్మికులను పనిలో పెట్టుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు భాస్కర్, చంద్రశేఖర్, ఉపేంద్రయ్య, ఆరీఫుల్లా, స్థానిక పోలీసులు, పలమనేరు పట్టణ పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా పవిత్ర


మంత్రి పెద్దిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న పవిత్ర, మురళి దంపతులు

పలమనేరు, జనవరి11 : రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సగా పలమనేరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పవిత్ర నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం హిందూపురంలో ఉన్న జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డిని కలిసి పవిత్ర, మురళీక్రిష్ణ దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు సహకరించిన రాజం పేట ఎంపీ మిథున్‌రెడ్డికి, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడకు, డీసీసీబీ అధ్యక్షురాలు రెడ్డెమ్మకు, వైసీపీ రాష్ట్రకార్యదర్శి క్రిష్ణమూర్తిలకు కృతజ్ఞతలు తెలిపారు. వారివెంట పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రి ఛైర్మన్ చెంగారెడ్డి ఉన్నారు.

వరి నాట్లలో మెలకువలు పాటించాలి

సోమల, జనవరి 11: రబీలో వరి నాట్లలో రైతులు మెలకువలు పాటించాలని ఏడీఏ శివకుమార్ సూచించారు. గురువారం ఇరికిపెంట వద్ద వరినాట్లు వేస్తున్న రైతులతో ఆయన మాట్లాడారు. వరి నాట్లు వేసే సమయంలో కొనలను తుంచాలన్నారు. ప్రతి రెండు మీటర్లకి కాలిబాటలు వదలాలని సూచించారు. ఎంఏవో సుధాకర్, కుమార్, మంజునాథ్, జ్యోతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెలోకి

రొంపిచెర్ల, జనవరి 11: ప్రభుత్వం వీఆర్ఏల సమస్యలు పరిష్కరించని పక్షంలో సమ్మెకు వెళ తామని వీఆర్ఏ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.అంజి, జిల్లా ఉపాధ్యక్షుడు ఇర్ఫాన్ పేర్కొన్నారు. గురువారం వారు డీఆర్‌వో రరాజశేఖర్‌కు వీఆర్ఏ సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలని, వాచ్‌మన్, అటెండర్ ప్రమోషన్‌లో 70శాతం పర్సంటేజ్ పెంచాలని, డీఏని తక్షణం విడుదల చేయాలని వినతిపత్రం ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా ఆయన రొంపిచెర్లలో మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్ ప్రతిపక్షంలో ఉండగా విజయవాడలో వీఆర్ఏల దీక్ష సమయంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన వారంరోజుల్లో త సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, దామోదర్, మల్లికార్జున, సుమంత్, తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ సభలను జయప్రదం చేయండి


రామకుప్పంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నేతలు

రామకుప్పం, జనవరి 11: కుప్పం నియోజకవర్గంలో టీడీపీ నిర్వహించే జయహో బీసీ బాట సభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ కుప్పం నియోజకవర్గ పరిశీలకులు గాజులఖాదర్‌బాషా, నాయిబ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు శాంతారాం, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శి రామలింగారెడ్డి, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ ఎంపీపీ చిన్నికృష్ణలు కోరారు. గురువారం వారు రామకుప్పంలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అనంతరం పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేశారు.

యోగానందలో సంక్రాంతి సంబరాలు



శాంతిపురం, జనవరి 11 : మండల పరిధిలోని పరమహంస యోగానంద విద్యాలయంలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు కోలాహలంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి హాజరయ్యారు. ఉదయం పాఠశాలలోని గోవులకు పూజలు చేశారు. చెరుకు గడలు, వివిధ రకాల పూలు, పండ్లతో తరగతి గదులను అలంకరించారు. భోగిమంటలు వేసి గొబ్బిల్లు పాటలు పాడి సందడి చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ ఆజాద్ హుసేన్ విద్యార్థులకు సంక్రాంతి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర ఓబన్నకు ఘన నివాళి



శాంతిపురం, జనవరి 11 : స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డెర ఓబన్న జయంతిని ఆ కులస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. తులసినాయనపల్లె గ్రామం వద్ద వడ్డెర కమ్యూనిటీ భవనానికి కేటాయించిన స్థలంలో ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి పూజలు చేశారు. పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేశారు. కమ్యూనిటీ భవనం పూర్తయిన ఓబన్న విగ్రహం ఏర్పాటుకు కృషిచేస్తామని వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్న తెలిపారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్ర క్రీడలు

రొంపిచెర్ల, జనవరి 11: రొంపిచెర్ల మండలంలో రెండు రోజులుగా జరిగిన ఆడుదాం ఆంధ్ర క్రీడలు ముగిసినట్లు ఎంపీడీవో రాజేంద్ర తెలిపారు. 8 సచివాలయాల పరిధిలో 912 మంది క్రీడాకారులు 5 క్రీడల్లో పాల్గొన్నారన్నారు. ఈ క్రీడల్లో బొమ్మయ్యగారిపలె, రొంపిచెర్ల, చిచ్చిలివారిపల్లె క్రీడాకారులు విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు.

జీవో రాకుంటే సమ్మె ఉధృతం

పలమనేరు, జనవరి11 : జీఓ రాని పక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని మునిపల్ కార్మిక సంఘ నాయకులు మద్దెలసుబ్రమణ్యం, వి.శ్రీనివాసులు, జాన్ ఆనంద్ స్పష్టం చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. గత రాత్రి మున్సిపల్ కార్మిక సంఘ నాయకులతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయన్నారు. కార్మికులకు రూ.21 వేలు జీతం, మృతిచెందని కార్మికుల దహన ఖర్చులను రూ.15వేల నుంచి రూ.20 వేలకు పెంపు, మృతిచెందిన కార్మికులకు చెల్లించే నష్టపరిహారం రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచడానికి ప్రభుత్వం సమ్మతించిందన్నారు. అందుకే 8 రోజులుగా చేస్తున్న సమ్మెను గురువారం నుంచి తాత్కాలి కంగా విరమించినట్టు తెలియజేశారు. అయితే ఇంకా ప్రభుత్వం జీవో విడుదల చేయాల్సి ఉందన్నారు. జీవో రానిపక్షంలో ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

పుంగనూరు రూరల్, జనవరి11: పట్టణంలోని తూర్పు మొగసాల సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.3110లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాఘవరెడ్డి తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

పుంగనూరు రూరల్, జనవరి11: పట్టణంలోని స్పందన ఆస్పత్రి సమీపంలో ఓ ద్విచక్రవాహనం చోరీ కి గురైంది. సీఐ రాఘవరెడ్డి కథనం మేరకు.. మండలంలోని బండ్లపల్లె పంచాయతీ నెల్లూరుపల్లెకు చెందిన ఎన్.మధు పట్టణంలోకి వచ్చాడు. స్పందన ఆస్పత్రి వద్ద ద్విచక్రవాహనం పార్కింగ్ చేసి అక్కడి బ్యాంకులోకి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి వాహనం కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశారు.

మానవతా సేవ సంస్థకు రూ. 50వేలు విరాళం



పుంగనూరు రూరల్, జనవరి11: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థకు పట్టణానికి చెందిన విశ్రాంత ఎంఈవో మొగిలప్పనాయుడు దంపతులు రూ. 50వేలు విరాళం అందజేశారు. గురువారం సంస్థ పట్టణ కార్యదర్శి ఏసీ నారాయణరెడ్డికు విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు.

అక్రమ కట్టడాలు నిర్మిస్తే కఠిన చర్యలు



పుంగనూరు రూరల్, జనవరి11: పట్టణ పరిధిలో అక్రమ కట్టడాలు, దురాక్రమణ చేస్తే కఠిన చర్యలు తప్ప వని మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం రాత్రి పట్టణంలోని గోకుల్ థియేటర్ వీధి చివరలో రోడ్డుపై కొందరు గోడ నిర్మించారు. స్థానికులు ఫిర్యాదు చేయడంతో పోలీసుల సాయంతో సిబ్బందితో వెళ్లి గోడను తొలగించారు.

బాటగంగమ్మకు అమావాస్యపూజలు



బైరెడ్డిపల్లె, జనవరి 11: బైరెడ్డిపల్లెని బాటగంగమ్మ ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నాగేంద్ర, జయచంద్ర అమ్మవారికి అభిషేకంచేసి విశేషాలంకరణలు చేశారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వడ్డెర ఓబన్నకు టీడీపీ నివాళి


నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పుంగనూరు రూరల్, జనవరి11: వడ్డెర ఓబన్న జయంతిని పుంగనూరు మండలంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం మండలంలోని కురప్పల్లెలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, నాయకులు మాధవరెడ్డి, వడ్డెర సంఘనాయకులు సుబ్రహ్మణ్యం, ఆర్సీ, గంగాధర్, శ్రీరాములు, గంగులప్ప, మసెన్న, వెంకటరమణ, అంజి, భాస్కర్, రవి, పూజగానిపల్లె వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ● అలాగే వైసీపీ వడ్డెర సంఘనాయకులు అంబేడ్కర్ సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు హేమచంద్ర, రమణ, శ్రీనివాసులు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పతనం ఖాయం : టీడీపీ


మాట్లాడుతున్న గాజుల ఖాదర్‌బాషా తదితరులు

కుప్పం, జనవరి 11: అంగన్వాడీల నుంచి 108 సిబ్బంది దాకా కొనసాగుతున్న సమ్మెలతో వైసీపీ పతనం ఆగేది కాదని ఆ ప్రభుత్వం ఇంటికెళ్లడం తథ్యమని టీడీపీ కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. ఎవరు ఎన్ని రకాలుగా అడ్డుకున్నా రాబోయే ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించి చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావడం తద్వారా రాష్ట్రాభివృద్ధి జరగడం ఖాయమని పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటి నుంచి అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ఒకవైపు అంగన్వాడీలు, మరోవైపు మున్సిపల్ కార్మికులను వేధిస్తూ ముఖ్యమంత్రి జగన్ రాక్షసానందం పొందుతున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు అన్నివర్గాలకు అనేక హామీ లు ఇచ్చి, గద్దెనెక్కాక వాటిని ఏమాత్రం నెరవేర్చకుండా మోసం చేశారన్నారు. అమరావతితో పాటు అన్నిరంగాలూ విధ్వంసానికి గురయయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే చంద్రబాబు నిర్వహిస్తున్న 'రా.. కదలిరా ' సభలకు అనూహ్య స్పందన వస్తోందన్నారు. టీడీపీ ప్రకటించిన వైసీపీ పాలనలో బీసీలు హత్యలకు గురయ్యారని, వేలమంది బీసీలపై అక్రమ కేసులు బనాయించి జైళ్లపాలు చేశారని ఆరోపించారు. టీడీపీ అధికారం లోకి రాగానే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకొస్తామన్నారు. మరోవైపు జగన్ పాలనలో రైతాంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. ధరల స్థిరీకరణకు, విపత్తుల పరిహారానికి నిధులు కేటాయి స్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని జగన్‌రెడ్డి తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. రాయలసీమ ప్రాజెక్టులను అటకెక్కించి సీమ ప్రజలకు ద్రోహం చేశారని మండిపడ్డారు. ఈ సమావేశంలో టీడీపీ మైనారిటీ సెల్ కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడు జాకీర్, రమేష్, అస్మతుల్లా, ఐ-టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో టీడీపీ విజయం తథ్యం


ఆరడిగుంటలో కరపత్రాలు అందిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, జనవరి11: రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలవడం ఖాయమని టీడీపీ పుంగనూరు ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని ఆరడిగుంట పంచాయతీ అలజనేరు, కీలకిరి, జొకొత్తురు, ఆరడిగుంట, కొండచర్ల, చిన్న కొండచెర్ల, అమ్మిగానిపల్లె, కురప్పల్లె తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి టీడీపీ మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావాలని మహిళలు, యువత, రైతులు కోరుకుంటున్నారన్నారు. గ్రామాల్లో తమకు వలంటీర్లు సహకరిస్తున్నారని వారిని తొలగించడం సిగ్గుచేట్టుగా ఉందన్నారు. అంగన్వాడీలు ఆందోళన చేయకుండా బెదిరించడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు, ఉద్యోగులు నిరసనలు, ఆందోళనలు చేసుకునే హక్కు రాజ్యాంగం కల్పించింద న్నారు. ఇక్కడ ఆ హక్కును సైతం కాలరాస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవ రెడ్డి, శ్రీకాంత్, ఆసూరి బాలాజీ, సీవీరెడ్డి, పోలీస్ గిరి, సుహేల్‌బాషా, రమేశ్‌నాయుడు, రామకృష్ణ, రెడ్డెప్ప, నాగరాజ, చంద్రశేఖర్, మల్లిఖ్జాన, గోపాల్, వీరభద్ర, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, గంగాధర్, ప్రసాద్, రామయ్య, జనసేన నాయకులు పగడాల రమణ, చిన్నారాయల్, విరూపాక్షి, సరేశ్‌రాయల్, చైతన్యరాయల్, పాముల హరి, బాలాజీ నాయక్, హరినాయక్, రమణ పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత చంద్రశేఖర్ మృతి



చంద్రశేఖర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు (ఇన్‌సెట్లో) చంద్రశేఖర్ ఫైల్‌ఫొటో

రామకుప్పం, జనవరి 11: రామకుప్పం మండలం ముద్దనపల్లె పంచాయతీ ఆవులకుప్పానికి చెందిన టీడీపీ సీనియర్ నేత చంద్రశేఖర్ గురువారం అనారోగ్యంతో తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ ముద్దనపల్లె పంచాయతీ పార్టీ అధ్యక్షుడిగా, ప్రధానకార్యదర్శిగా, బీసీ సెల్ మండల ప్రధానకార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన ఈడిగ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఆయన మృతి పట్ల ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

చంద్రబాబు సంతాపం

చంద్రశేఖర్ మృతి పట్ల పార్టీ అధినేత చంద్రబాబునాయుడు తమ ప్రగాఢసంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి తనకు బాధ కల్గించిందని ఆయన పంపిన సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఈ విషాద పరిస్థితుల నుంచి ఆయన కుటుంబ సభ్యులు త్వరగా కోలుకునేలా భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.

అధికారం సాధిస్తేనే రాజ్యాంగ హక్కుల పరిరక్షణ


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

కుప్పం, జనవరి 11: అధికారంలోకి వస్తేనే బహుజనులకు రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సాధ్యమ వుతుందని బహుజన సమాజ్ పార్టీ జోనల్ కో-ఆర్డినేటర్లు పి.గుర్రప్ప, టి.విజయకుమార్, జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రబాబు అన్నారు. బీఎస్పీ కుప్పం నియోజకవర్గ సమావేశం గురువారం కుప్పంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శివాడీ గోవిందు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తమకు కల్పించిన రాజ్యాంగ హక్కులు నేడు కాలరాస్తున్నారని విమర్శించారు. తిరిగి వాటిని సాధించుకోవాలంటే ఎన్నికల ద్వారా అధికారం పొందడం ఒక్కటే మార్గమని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో తమ అభ్యర్థికి ఏనుగు గుర్తుకు ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. చిత్తూరు పార్లమెంటు స్థానం బీసీ అభ్యర్థిగా టి.విజయ కుమార్‌ను ఇదివరకే ప్రకటించిన విషయం గుర్తుచేశారు. అంతకుముందు బీఎస్పీ నాయకులు ఆర్టీసీ బస్టాండు కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు నివాళులర్పించారు. ఈ సమావేశంలో నాయకుడు గణేశ్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెయ్య దూడల ఉత్పత్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి


ఆవులను, దూడలను పరిశీలిస్తున్న డీడీ బాలసుబ్రహ్మణ్యం

చౌడేపల్లె, జనవరి11: పెయ్య దూడల ఉత్పత్తి పథకాన్ని పాడి రైతులు సద్విని యోగం చేసుకోవాలని చిత్తూరు పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ బాల సుబ్రహ్మణ్యం కోరారు. గురువారం ఆయన మండలంలోని చిన్న కొండామర్రి, చిట్రెడ్డిపల్లె, పొదలపల్లె, గ్రామాలలో పెయ్యదూడల ఉత్పత్తి పథకం అమలును పరిశీలించారు. 27 చూడు ఆవులను, 5 లేగ దూడలను సందర్శించారు. పాడి రైతులకు ఉచితంగా మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. రూ.1350 విలువ చేయు పెయ్య దూడల వ్యాక్సిన్‌ను రాయితీతో రూ.500లకు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీ మనోహర్, డాక్టర్లు చిరంజివి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



వి.కోట, జనవరి 11: అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి గ్రామాల నుంచి అక్షింతలు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ ప్రాంత సేవా ప్రముఖ్ కొండారెడ్డి తెలిపారు. గురువారం రామజన్మభూమి తీర్థ క్షేత్ర నుంచి వచ్చిన అక్షింతలకు పట్రపల్లె రామాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీరామ భక్త మండలి ఆధ్వర్యంలో పట్టణంలో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు.

క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి

కల్లూరు, జనవరి 11: ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని ఎంపీడీవో రాజశేఖరబాబు, ఎంఈవోలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి ఖోఖో, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ క్రీడలు నిర్వ హించారు. పురుషుల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కల్లూరు సచివాలయం-1 విజేతగా, రన్నర్‌గా మంగళం పేట సచివాలయం జట్టు నిలిచాయి. మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కావేటిగారిపల్లి జట్టు విజేతగా రన్నర్‌గా మతుకువారిపల్లి నిలిచింది. పురుషుల ఖోఖో పోటీల్లో కల్లూరు సచివాలయం-1 విజేతగా రన్నర్‌గా ఎల్లంకివారిపల్లి నిలిచాయి. మహిళల జట్టు విజేతగా కావేటిగారిపల్లి, రన్నర్‌గా ఎల్లంకివారిపల్లి నిలిచింది. పురుషుల కబడ్డీ పోటీల్లో గడ్డంవారిపల్లి విజేతగా, రన్నర్‌గా మంగళంపేట, మహిళల విభాగంలో విన్నర్‌గా కల్లూరు-2, రన్నర్‌గా ఎల్లంకివారిపల్లి సచివాలయం జట్లు నిలిచాయి.

వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకండి : ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్


మునినారాయణకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఇతర టీడీపీ నేతలు

శాంతిపురం, జనవరి 11 : వైసీపీ అరాచక పాలనకు ప్రజలు స్వస్తి పలకాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి రేగడ దిన్నెపల్లె గ్రామంలో క్లస్టర్ ఇన్‌చార్జి విజయ రామిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు నెలల తరువాత వచ్చేది చంద్రన్న రాజ్యమేనన్నారు. ఇప్పటికే అటు ప్రజల్లోనూ, ఇటు ఉద్యోగుల్లోనూ వైసీపీపై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. చంద్రబాబుకు ఓటు వేస్తే కుప్పంతో పాటు రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందు తుందని తెలియజేశారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మాట్లాడుతూ శాంతిపురం నుంచి రేగడ దిన్నెపల్లె, నల్లపరెడ్డూరు, అనెకర, వడగాండపల్లె, బ్రాహ్మణ కొత్తూరు, చంద్రగిరి క్రాస్, బెళ్లకోగిల గ్రామాలు 1989కి ముందు ఎలా ఉన్నాయో ఇప్పుడు ఎలా ఉన్నాయో పెద్దలు గుర్తుచేసుకోవాలన్నారు. టీడీపీకి ఓటు వేసేలా యువతను చైతన్యం చేయాలని కోరారు. చంద్రబాబు హయాంలోనే శాంతిపురం నుంచి కర్ణాటక సరిహద్దులోని బెళ్లకోగిన వరకు డబుల్ రోడ్డు వేశామన్నారు. కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబులు మాట్లాడుతూ చంద్రబాబును ఈ ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు.

రూ.2.లక్షల ఆర్థికసాయం

రేగడదిన్నెపల్లె పంచాయతీ పార్టీ అధ్యక్షుడు మునినారాయణ గత ఏడాది నారా లోకేశ్ యువగళం పాదయాత్రకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురయ్యాడు. ఆ సమయంలో ముని నారా యణకు చంద్రబాబు ఫోన్ చేసి పరామర్శించారు. ఆర్థికసాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆయనకు రూ.2 లక్షలు ఆర్థికసాయం అందించారు. ఆ నగదును ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఇతర టీడీపీ నేతలు అందించారు. టీడీపీ మండల అధ్యక్షులు భాష్యం విశ్వనాథ్ నాయుడు, ప్రధాన కార్యదర్శి నాగరాజు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్, రాళ్లబూదుగూరు క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, ఏఎంసీ నాగరాజు, యూనిట్ ఇన్‌చార్జిలు ఆర్ఎస్ మణి, గోపాల్, జయరామిరెడ్డి, రమేష్‌రెడ్డి, నారాయణస్వామి, ఆంజనేయరెడ్డి, నారాయణరెడ్డి, ఉయ్యాల జయ రామిరెడ్డి, గోవింద రాజులు, చలపతి, రుద్రప్ప, లోకేష్, మురళి, సుగుణమ్మ, రాజేంద్ర, సుబ్బు పాల్గొన్నారు.

ఆగని అంగన్వాడీల ఆందోళన

పలమనేరు, జనవరి 11 : పలమనేరు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట గురువారం అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు నిరసన కొనసాగించారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె ఆపేది లేదని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గిరిధరగుప్తా, రాజ, డీపీ.మునిరత్నం పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలో స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం అంగన్వాడీలు నిరసనను చేపట్టారు. తమ డిమాండ్లు పరిష్కరించేవరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

శాంతిపురం: శాంతిపురంలో ఆందోళన చేస్తున్న అంగన్వాడీలకు అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. అయితే నోటీసులకు భయపడేది లేదని ఆందోళనలు ఆగవని తేల్చి చెప్పారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రామకుప్పం, శాంతి పురం అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.






పలమనేరు, బైరెడ్డిపల్లెలో అంగన్వాడీల నిరసన, శాంతిపురంలో అంగన్వాడీలకు ఆర్థికసాయం అందిస్తున్న స్థానికులు

రోగులకు పండ్ల పంపిణీ



కుప్పం, జనవరి 11: గుడుపల్లె మండలం గుత్తార్లపల్లె టీడీపీ విస్తరణ కమిటీ సభ్యుడు తోట భాస్కర్‌నాయు తన జన్మదినాన్ని పురస్కరిం చుకుని గురువారం కుప్పంలోని ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే కుప్పంలోని బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో ఉన్న అనాథలకు వీటిని పంచిపెట్టారు. టీడీపీ కుప్పం నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షులు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కన్నన్ పాల్గొన్నారు.

ఇంటి పట్టా ఇస్తామన్న అధికారులు


బాధితులతో మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బంగారుపాళ్యం, జనవరి 11: వర్మి కంపోస్టు యార్డులో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్న ఓ కుటుంబం దీనస్థితిపై ఈనెల పదో తేదీన 'చెత్త బతుకు మారదా.. జగనన్నా..?' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన పలమనేరు ఆర్డీవో మనోజ్‌కుమార్ రెడ్డి స్థానిక ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్ రెడ్డిని ఆదేశించారు. దాంతో గురువారం నల్లంగాడుకు చెందిన రోజా కుటుంబాన్ని తన కార్యాలయానికి పిలిపించి విచారించారు. వీరికి మూడ్రోజుల్లోపు ఇంటి పట్టా మంజూరు చేస్తామని, అలాగే పెన్షన్‌కు కూడా సిఫార్సు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఇంటి స్థలం ఇచ్చి ఆదుకోండి: టీడీపీ

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 11: డంపింగ్ యార్డులో తలదాచుకుంటున్న కుటుంబానికి ఇంటి స్థలం ఇచ్చి, ఆదుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి సప్తగిరి ప్రసాద్ కోరారు. ఈ మేరకు గురువారం డీఆర్వో రాజశేఖర్‌ను కలెక్టరేట్‌లో కలసి వినతిపత్రం అందించారు.

టీడీపీ నేత సీఆర్ రాజన్‌కు ఘన సన్మానం


సీఆర్ రాజన్‌ను సన్మానిస్తున్న అభిమానులు

చిత్తూరు సిటీ, జనవరి 11: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఆర్ రాజన్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు గాంధీ రోడ్డు నుంచి హైరోడ్డు, రాజీవ్ గాంధీ రోడ్డు నుంచి గిరింపేట విజయదుర్గా కళ్యాణమండపం వరకు ర్యాలీ నిర్వహించారు. జ్యోతీరావ్ పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. విజయదుర్గా కళ్యాణమండపంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, వన్నియకుల క్షత్రియ సంఘం నాయకులు సీఆర్ రాజన్‌ను గజమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చంద్రప్రకాష్, మాజీ మేయర్ కటారి హేమలత, మాజీ కార్పొరేటర్ శంకర్, మాజీ కౌన్సిలర్లు దేవరాజ్, ఉదయ్ కుమార్, నేతలు త్రిమూర్తి, విజయకుమార్, లెనిన్ నగర్ ఉదయ్‌కుమార్, మురుగ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ రైతులకు రాయితీతో పరికరాలు

బంగారుపాళ్యం, జనవరి 11: ఎస్సీ, ఎస్టీ మామిడి రైతులకు ప్రభుత్వం 50శాతం రాయితీతో పరికరాలను అందించనున్నట్లు ఉద్యానశాఖ అధికారి సాగరిక తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఢీకొన్న మూడు కార్లు: తప్పిన ప్రమాదం


విచారిస్తున్న పోలీసులు

గుడిపాల, జనవరి 11: మూడు కార్లు ఢీకొని.. పెనుప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం వేలూరు నుంచి చిత్తూరు వైపు ఒకదాని వెనుక ఒకటి మూడు కార్లు వెళుతున్నాయి. మండలంలోని కిలారిపల్లె వద్దకొచ్చేసరికి ముందు కారుకు అడ్డుగా ఆవు రావడంతో డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. దాంతో వెనుక వస్తున్న కార్లు వరుసగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముందు వాహనం వెనుక, మధ్య వాహనానికి వెనుకా ముందు, మూడో వాహనానికి ముందు భాగం ధ్వంసమైంది. వాహనాల్లోనివారు ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ ప్రమాదంతో ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామ్మోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్రమబద్ధీకరించి, కేసు నమోదు చేశారు.

నేడు రక్తదాన శిబిరం: ఆర్డీవో

నగరి, జనవరి 11: నగరి ఏరియా వైద్యశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆర్డీవో సుజన తెలిపారు. నగరి మున్సిపల్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎంపీటీసిలు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వార్డుమెంబర్లు అధికసంఖ్యలో యువత రక్తదానం చేసేలా చూడాలని కోరారు. కమిషనర్ వెంకట్రామిరెడ్డి, చైర్మన్ నీలమేఘం, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, మెప్మా సునీత, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విజయపురం, జనవరి 11: నగరి ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే సామాజిక సమతా సంకల్పాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో చంద్రమౌళి కోరారు. ప్రతి పంచాయతీ నుంచి 8 మందికి తక్కువ కాకుండా రక్తదానం చేయడానికి కార్యదర్శులు, సర్పంచ్‌లు సహకరించాలని కోరారు.

మామిడిలో సస్యరక్షణతో అధిక దిగుబడి


సమావేశంలో ప్రసంగిస్తున్న మధుసూదన్‌రెడ్డి

ఐరాల, జనవరి 11: సస్య రక్షణతో మామిడిలో అధిక దిగుబడి సాధించవచ్చని ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం పొలకలలోని ఆర్బీకేలో రైతులకు మామిడి సాగుపై అవగాహన కల్పించారు. ఉద్యాన అధికారి సాగరిక, సహాయకులు మురళీకృష్ణ, రామచైతన్య, నాయకుడు టెరిన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపురంలో 'వికసిత భారత్'

పెనుమూరు, జనవరి 11: రామకృష్ణాపురం సచివాలయంలో గురువారం వికసిత భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు అనేక సౌకర్యాలు కల్పిస్తుందని వివరించారు. సర్పంచ్ దూది వెంకటేశ్, నరసింహారెడ్డి, ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, ఏపీవో మీనాకుమారి, ఎంఈవో భాస్కర్‌నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చేపల చెరువు వేలం: చిప్పారపల్లె పంచాయతీలోని అల్లాల చేపల చెరువుకువేలం నిర్వహించారు. పది మంది పాల్గొనగా రుద్రయ్యనాయుడు రూ.62 వేలకు దక్కించుకున్నారని ఈవోపీఆర్డీ తెలిపారు.

వెల్‌నెస్ సెంటర్ తనిఖీ


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బెనర్జీ

యాదమరి, జనవరి 11: జంగాలపల్లె హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం గురువారం తనిఖీ చేసింది. సెంటర్ ద్వారా అందుతున్న సేవలను ఈ బృందంలోని సభ్యులు డాక్టర్ బెనర్జీ, డాక్టర్ కిరణ్‌లు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించడానికే తాము వచ్చామన్నారు. సభ్యులకు డాక్టర్ సురేఖ, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ స్వాగతం పలికారు.

హనుమజ్జయంతి వేడుకలు

గంగాధరనెల్లూరు, జనవరి 11: వేల్కూరు గ్రామంలోని వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు అభిషేకం, పూజలు చేశారు.

జీడీనెల్లూరులో నేడు జయహో బీసీ సమావేశం

గంగాధరనెల్లూరు, జనవరి 11: గంగాధరనెల్లూరు నీవా నది బ్రిడ్జికి సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు జిల్లా యాదవ సాధికారసమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ అధ్యక్షతన జయహో బీసీ సమావేశం జరగనుంది. ఈ మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు స్వామిదాస్, నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు రవియాదవ్, మండల టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు జ్యోతియాదవ్ తెలిపారు. ఈ సమావేశానికి బీసీకులాలకు చెందిన వారు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్వేటినగరం: జయహో బీసీ సమావేశాన్ని జయప్రదం చేయాలని టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు రవియాదవ్ కోరారు. నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యం : గాలి భానుప్రకాష్

నగరి, జనవరి 11: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని నగరి పార్టీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ తెలిపారు. ఒక్క చాన్స్ అంటూ రాష్ట్ర ప్రజలను జగన్ నట్టేట ముంచారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములను వదలకుండా అన్నిటినీ తాకట్టు పెట్టి రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల్లో ముంచేశారని విమర్శించారు. ఇసుక, గ్రానైట్, మైనింగు పేరుతో కోట్ల రూపాయలను లూటీ చేసి వైసీపీ నాయకులు కోట్లు గడించారన్నారు. మరోవైపు వైసీపీ వారి గూండాయిజం, దౌర్జన్యాలకు భయపడి పారిశ్రామికవేత్తలు పక్క రాష్ట్రాలకు తరలివెళ్లడం జరిగిందని తెలిపారు. ఈ అక్రమాలను ఎత్తి చూపడానికే 'రా.. కదలిరా.. కార్యక్రమాన్ని తమ అధినేత చంద్రబాబు చేపట్టారని వివరించారు.

'మహాశక్తి' మహిళలకు వరం : టీడీపీ


తూగుండ్రం దళితవాడలో కరపత్రాలతో ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు తదితరులు

గంగాధరనెల్లూరు, జనవరి 11: టీడీపీ మేనిఫెస్టోలోని మహాశక్తి పథకం మహిళలకు వరమని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా తూగుండ్రం దళితవాడలో గురువారం పలువురు టీడీపీనేతలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచిపెట్టారు. పార్లమెంట్ టీఎన్‌టీయుసీ అధికార ప్రతినిధి జీవరత్నం, తూగుండ్రం గ్రామకమిటీ అధ్యక్షుడు నీరజాక్షులురెడ్డి, ప్రధానకార్యదర్శి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' నిర్వహణపై క్రీడాకారుల అసహనం


క్రీడాకారులతో మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ పావన్‌కుమార్

పెనుమూరు, జనవరి 11: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమ నిర్వహణపై క్రీడాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గురువారం పెనుమూరులో జడ్పీహైస్కూల్‌లో కబడ్డీ పోటీలు జరిగాయి. కేసీపల్లి జట్టులో రిజిస్ట్రేషన్ చేసుకోనివారు ఆడుతున్నారని సీఆర్ కండ్రిగ జట్టు క్రీడాకారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ పరిస్థితి గందరగోళంగా తయారైంది. ట్రైనీ డీఎస్పీ పావన్‌కుమార్, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి రెండు జట్ల క్రీడాకారులతో మాట్లాడి సర్దుబాటు చేయాల్సి వచ్చింది. చివరకు కేసీపల్లి విజేతగా నిలిచింది.

ఆడిన ప్రతి జట్టులోని క్రీడాకారులకు గాయాలు

కబడ్డీ క్రీడకు నల్లరేగడి నేలను ఎంచుకుంటారు లేదా ఇసుక ఎక్కువగా ఉన్న చోట నిర్వహిస్తారు. అయితే పెనుమూరు పాఠశాల మైదానంలో గట్టి నేలపైనే కబడ్డీ ఆడించారు. దాంతో పాల్గొన్న ప్రతీ జట్టులోని క్రీడాకారులకు గాయాలయ్యాయి. సందర్శకులు సైతం ఇలాంటి ప్రదేశంలో కబడ్డీ ఎలా నిర్వహిస్తారని అసంతృప్తి వ్యక్తం చేశారు.

పలు మండలాల్లో జరిగిన క్రీడలిలా..

బంగారుపాళ్యం, జనవరి 11: ఆడుదాం ఆంధ్ర మండలస్థాయి కబడ్డీ పోటీల్లో చీకురుపల్లి జట్టుపై ముంగరమడుగు జట్టు విజయకేతనం ఎగురవేసి సెమీస్‌కు అర్హత పొందింది. వాలీబాల్ పోటీల్లో ఎర్రాండ్లపల్లిపై బంగారుపాళ్యం జట్టు విజయం సాధించింది. ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శంకరయ్య, చెంగల్రాయన్, సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి, పీఈటీలు పాల్గొన్నారు.

పాలసముద్రం, జనవరి 11: పాలసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కబడ్డీ పోటీల్లో పురుషులు, స్త్రీల జట్లలో పాలసముద్రం సచివాలయ జట్లు విజేతగా నిలిచాయని ఎంపీడీవో రామనాథరెడ్డి తెలిపారు. అలాగే వెంగళరాజుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రికెట్ పోటీలు జరిగాయి. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విజయపురం, జనవరి 11: క్రికెట్ పోటీల్లో కళియంబాకం జట్టు విజేతగా నిలిచిందని ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. ఎంఈవో ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూతలపట్టు, జనవరి 11: పూతలపట్టు ఉన్నత పాఠశాలలో జరిగిన కబడ్డీ పోటీల్లో బైటపల్లిపై వేపనపల్లి జట్టు విజేతగా నిలిచింది. ఎంపీడీవో గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, జడ్పీటీసీ దేవిక, ఎం.ఎస్. మణి, ద్వారకనాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జలశక్తి అభియాన్‌లో మన జిల్లా


సమావేశంలో ప్రసంగిస్తున్న గంగాభవాని

సమీక్షలు - సమావేశాలు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 11: దీర్ఘకాలంగా కరువు పీడిత రాయలసీమ ప్రాంతంగా పరిగణించి జలశక్తి అభియాన్‌లో మన జిల్లాను చేర్చిందని సౌత్ రీజియన్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ రీజనల్ డైరెక్టర్ కృష్ణమూర్తి, డ్వామా పీడీ గంగాభవాని తెలిపారు. గురువారం డ్వామా సమావేశ మందిరంలో జిల్లాలోని 15 మండలాల డ్వామా టెక్నికల్, ఫీల్డ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ.. భూగర్భ జలాల నిర్వహణ, అభివృద్ధి తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు నిర్ణయించినట్లు వివరించారు. దీనిప్రకారం అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు ఇన్‌చార్జి రవికుమార్, ఏపీ స్టేట్ యూనిట్ నుంచి ఈఈ ఓబులేసు, మోనిక, సైంటిస్టు శరత్ తదితరులు పాల్గొన్నారు.

నిల్వ ఆధారిత ఆహార ఉత్పత్తులపై దృష్టి సారించాలి

చిత్తూరు (సెంట్రల్), జనవరి 11: నిల్వ ఆధారిత ఆహార ఉత్పత్తులపై ఆసక్తి చూపాలని డీఆర్‌డీఏ పీడీ తులసి సూచించారు. గురువారం జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో పీఎంఎఫ్ఎం లబ్ధిదారులు, రైతులకు నిల్వ ఆధారిత ఆహార ఉత్పత్తులపై అవగాహన సదస్సు నిర్వహించారు. చిరుధాన్యాలపై ప్రపంచ దేశాలు ఆసక్తి చూపుతున్న తరుణంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి డిమాండ్ వచ్చిందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ విలువలో 10 శాతం రైతులు చెల్లిస్తే.. 33 శాతం సబ్సిడీ, 55 శాతం బ్యాంకు రుణం లభిస్తుందన్నారు. అహల్ జా సంస్థ ప్రతినిధులు సుభాష్, కిరణ్, కార్తీక్‌లు నిల్వ ఆధారిత ఉత్పత్తులు, గ్రేడింగ్, మార్కెటింగ్ తదితర అంశాలను వివరించారు. డీపీఎంలు వెంకటేష్, రవికుమార్, ఏపీఎంలు సూరి, మధు పాల్గొన్నారు.

సంక్రాంతిలోపు జీతం బకాయిలు చెల్లించండి | మధ్యాహ్న భోజన కార్మికులు


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 11: సంక్రాంతిలోపు జీతం బకాయిలు చెల్లించాలని గురువారం డీఈవో విజయేంద్రరావుకు మధ్యాహ్న భోజన కార్మికులు వినతి పత్రం సమర్పించారు. ఏపీ ప్రభుత్వ పాఠశాలల ఆయాలు, వర్కర్లు యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి జయకుమారి మాట్లాడుతూ.. మూడు నెలలుగా ఆయాలకు, రెండు నెలలుగా కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజు, ఆయాలు, స్వీపర్లు, వర్కర్లు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో నెల్లేపల్లె విద్యార్థిని ప్రతిభ


జె.భవ్యశ్రీ

గంగాధరనెల్లూరు, జనవరి 11: భారత రాజ్యాంగంలో డాక్టర్ అంబేడ్కర్ పాత్ర అనే అంశంపై గురువారం చిత్తూరు పీసీఆర్ హైస్కూల్లో జిల్లాస్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో నెల్లేపల్లె హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న జె.భవ్యశ్రీ మొదటి బహుమతి కైవసం చేసుకుంది. ఈ మేరకు హెచ్ఎం సుబ్బరత్నమ్మ, ఇన్‌చార్జి హెచ్ఎం యుగంధరాచ్చారి తెలిపారు. ఈనెల 19వతేదీన చిత్తూరులో కలెక్టర్ షన్మోహన్ చేతుల మీదుగా బహుమతి అందుకోనున్నట్లు తెలిపారు. దీంతో విద్యార్థినిని టీచర్లు, విద్యార్థులతో కలిసి అభినందించారు.

ఇలా ఉంటే నడిచేదెలా?


రోడ్డుపై పారుతున్న మురుగు

కార్వేటినగరం, జనవరి 11: కార్వేటినగరం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో పోలీస్ స్టేషన్ క్వార్టర్స్ నుంచి కుమ్మరి గుంటకువెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్డుపక్కల పేరుకున్న చెత్తాచెదారాన్ని శుభ్రం చేయడంలో పంచాయతీ అధికారులు విఫలం చెందారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డుపై మురుగు నిల్వ చేరి దోమలు పెరుగుతున్నాయని వాపోతున్నారు. ఇకనైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



చిత్తూరు (సెంట్రల్), జనవరి 11: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ముద్రించిన 2024 క్యాలెండర్, స్టిక్కర్లను గురువారం విజయవాడలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం, మహిళా విభాగం అధ్యక్షురాలు ప్రభావతి, నాయకులు కేశవులు, మురళి,యువరాజ్‌తదితరులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే జైలుకే

పలమనేరు, జనవరి11 : బాలలను పనిలో పెట్టుకుంటే జైలు శిక్ష తప్పదని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవ అధికార సంస్థ చైర్మెన్ పి. శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా పట్టణంలో న్యాయవాదులు, లేబర్‌ఆఫీసర్ మధుబాబు విస్తృత ప్రచారం చేశారు. పలు దుకాణ, హోటల్ యజమానులను కలిసి బాలకార్మికులను పనిలో పెట్టుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు భాస్కర్, చంద్రశేఖర్, ఉపేంద్రయ్య, ఆరీఫుల్లా, స్థానిక పోలీసులు, పలమనేరు పట్టణ పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

పుంగనూరు రూరల్, జనవరి11: పట్టణంలోని స్పందన ఆస్పత్రి సమీపంలో ఓ ద్విచక్రవాహనం చోరీ కి గురైంది. సీఐ రాఘవరెడ్డి కథనం మేరకు.. మండలంలోని బండ్లపల్లె పంచాయతీ నెల్లూరుపల్లెకు చెందిన ఎస్.మధు పట్టణంలోకి వచ్చాడు. స్పందన ఆస్పత్రి వద్ద ద్విచక్రవాహనం పార్కింగ్ చేసి అక్కడి బ్యాంకులోకి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి వాహనం కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశారు.





నగరి, కార్వేటినగరంలోని డిగ్రీ కళాశాలల ఆవరణంలో సంబరాలు జరుపుకున్న అధ్యాపకులు, విద్యార్థులు

ముందస్తు సంక్రాంతి సంబరాలు

నగరి, జనవరి 11: నగరి డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రాజు, అధ్యాపకులు ఇందిరా ప్రియదర్శిని, రేవతి, పంకజం, మహేశ్వరి, వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్వేటినగరం, జనవరి 11: కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన సంబరాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయరెడ్డి, అధ్యాపకులు బాల సుబ్రమణ్యం ఆచారి, సీఎస్ లత, సుబ్బారావు, బాబు, కార్తీక్, రాజశేఖర్, భార్గవి, విశ్వనాథం, సిబ్బంది రవి, అశ్విని, తేజోవతి, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

లోకేశ్‌ని కలిసిన ఐరాల నాయకులు



ఐరాల, జనవరి 11: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ని గురువారం ఆయన నివాసంలో ఐరాల మండలానికి చెందిన పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి మోతుకూరి సోమశేఖర్ నాయుడు, ప్రముఖ వ్యాపారవేత్త సన్నపనేని వెంకటేశులు కలిశారు. ఈ సందర్భంగా పూతలపట్టు నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారని నాయకులు తెలిపారు.

కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె

కార్వేటినగరం, జనవరి 11: కార్వేటినగరం ఎంపీడీవో ఆఫీసు వద్ద అంగన్వాడీల నిరవధిక సమ్మె గురువారంతో 31 రోజుకు చేరుకుంది. నోటీసులు జారీ చేసి సమ్మెను అడ్డుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు కొనసాగిస్తోందని ఆరోపించారు. కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కార్వేటినగరం, వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం మండలాల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

దీక్షలు ముగిసినా సమ్మె కొనసాగింపు: సీఐటీయూ


కలెక్టరేట్ వద్ద దీక్షలో పాల్గొన్న అంగన్వాడీలు

చిత్తూరు రూరల్, జనవరి 11:. జిల్లా కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన రిలే దీక్షలు గురువారం నాటికి ముగిశాయని, కానీ సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు గంగరాజు తెలిపారు. గురువారం కలెక్టరేట్ వద్ద రిలే దీక్ష ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 31 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎంత మాత్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నుంచి ఆయా సీడీపీవో కార్యాలయం ఎదుట సమ్మె కొనసాగుతుందని చెప్పారు.

వరసిద్ధుడి సేవలో యష్



ఐరాల(కాణిపాకం), జనవరి 11: యూఎస్ఏ టీడీపీ ఎన్ఆర్ఐ రీజనల్ కోఆర్డినేటర్ యశస్వి(యష్) గురువారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయనవెంట టీడీపీ నేతలు దొరబాబు, కాజూరు బాలాజి, చంద్రప్రకాష్, మధుసూదన్‌రావు, నరసింహులు, సతీష్ తదితరులున్నారు.

వలంటీర్లకు సంక్రాంతి కానుక



చిత్తూరు, జనవరి 11: చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల్లోని 1,600 మంది వలంటీర్లకు గురువారం సంక్రాంతి కానుకగా దుస్తులు, వాటిని కుట్టించుకోవడానికి రూ.వెయ్యిని ఏపీఎస్ఆర్టీసీ వైస్‌చైర్మన్ విజయానంద రెడ్డి పంపిణీ చేశారు. డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, కార్పొరేటర్లు సహదేవన్, మధురెడ్డి, నాయకులు కేపీ శ్రీధర్, శంకరయ్యగుంట అన్బు, దొడ్డిపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

చర్చి ప్రారంభం

గుడిపాల, జనవరి 11: 197 రామాపురంలో గురువారం నూతన చర్చి ప్రారంభోత్సవం జరిగింది. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి, వైసీపీ మండల అధ్యక్షుడు కనకం జనార్దన్, గుడిపాల ఎంపీటీ గోళ్ల హరిప్రసాద్ చౌదరి, కుప్పిగానిపల్లె సర్పంచ్ మధుసూదన్ రాయల్ పాల్గొన్నారు.

వడ్డె ఓబన్నకు నివాళి


కేక్ కట్ చేసిన పురుషోత్తం తదితరులు

పెనుమూరు, జనవరి 11: స్వాతంత్ర్య పోరాటంలో వీరమరణం పొందిన బీసీ నేత వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. వడ్డెర సంఘ మండల అధ్యక్షుడు పురుషోత్తం ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేయగా, జిల్లా అధ్యక్షుడు మణి, మనోహర్, భాస్కర్, రెడ్డెప్ప, వెంకటరమణ, గుర్రప్ప, చక్రవర్తి, చిరంజీవి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నగరి పీఏసీఎస్‌కు స్టార్‌కోడ్ సర్టిఫికెట్



నగరి, జనవరి 11: నగరి పీఎసీఎస్‌కు స్టార్‌కోడ్ సర్టిఫికెట్ దక్కింది. సోమవారం ఢిల్లీలో జరిగిన సహకార్ సే సమృద్ధి కార్యక్రమంలో ఈసర్టిఫికెట్‌ను పీఎసీఎస్ సీఈవో తులసిపిళ్లై, అధ్యక్షుడు తిరుమలరెడ్డికి కేంద్ర ప్రభుత్వ సహకార అధికారులు అందించారు. చిత్తూరు జిల్లాలో నగరి, పలమనేరు, చిత్తూరు పీఏసీఎస్‌లకు వారి ప్రోగ్రెస్‌ను అనుసరించి స్టార్‌కోడ్‌లు అందజేశారని సీఈవో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలో దేశవ్యాప్తంగా 2వేల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాలను ప్రారంభించనున్నారని తెలిపారు.

దివ్యాంగుడికి రూ.25వేల సాయం



చిత్తూరు సిటీ, జనవరి 11: నగరానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త, దివ్యాంగుడు శంకరయ్యకు రూ.25వేలను గురువారం జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత గురజాల జగన్మోహన్ అందజేశారు. అలాగే గుడిపాల మండలంలోని కొత్తపల్లెలో ప్రమాదవశాత్తూ ఇల్లు కాలిపోయిన అముదకు కూడా రూ.10వేలను అందజేశారు.